# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 23-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి అయ్యే వ్యయ భారాన్ని ప్రజలపై ఒక్క రూపాయి కూడా వేయడం లేదని మంత్రి పి. నారాయణ స్పష్టం చేశారు.
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వెనుకబడిన తరగతులు (బిసి) సంక్షేమ శాఖపై సమీక్ష నిర్వహించారు.
- విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో వుందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈరోజు కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.

=====================

రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి అయ్యే వ్యయ భారాన్ని ప్రజలపై ఒక్క రూపాయి కూడా వేయడం లేదని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. భూ సమీకరణ ద్వారా రైతుల నుండి సేకరించిన భూములను విక్రయించగా వచ్చే నగదుతోనే అమరావతి అభివృద్ధికై తీసుకున్న రుణాలు తీర్చేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈరోజు రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 44వ సీఆర్డీఏ సమావేశం అనంతరం మంత్రి నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ... రాజధాని అమరావతి అభివృద్ధి పనులు, టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. వచ్చే సంవత్సరం జూన్ 12వ తేదీ నాటికి 1.18 లక్షల టిడ్కో గృహ నిర్మాణాలను పూర్తి చేసి, ప్రారంభిస్తామని మంత్రి నారాయణ వెల్లడిస్తూ....

(వాయిస్ 25 సెకన్లు)

=====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వెనుకబడిన తరగతులు (బిసి) సంక్షేమ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్. సవిత, ఉన్నతాధికారులు హాజరయ్యారు. సమీక్ష అనంతరం మంత్రి ఎస్. సవిత పాత్రికేయులతో మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధికి ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యతనిస్తారని పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్ల అభివృద్ధికి 11.56 కోట్ల రూపాయలు మంజూరు చేసినందుకు మంత్రి డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామిని ప్రత్యేకంగా కలిసి మంత్రి ఎస్.సవిత ధన్యవాదాలు తెలిపారు.

=====================

విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో వుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు... విశాఖలో జరిగిన రోజ్ గార్ మేళాలో పాల్గొన్న అనంతరం ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... స్టీల్ ప్లాంట్ సమస్యలపై ప్రభుత్వం లోతుగా అధ్యయనం చేస్తోందన్నారు... స్టీల్ ప్లాంట్ నిర్వహణ, కార్మికుల సమస్యలు, ప్రైవేటీకరణ లాంటి అంశాలపై ఎలాంటి అభద్రతా భావం అవసరం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అదనంగా నిధులు కూడ ఇవ్వడానికి ఉక్కు మంత్రిత్వ శాఖ సిద్దంగా ఉందని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

(వాయిస్ 36 సెకన్లు)

=====================

కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఈరోజు గొడవర్రు గ్రామంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. రహదారుల నిర్మాణ పనులు జరుగుతున్న చోట గొయ్యి తీయించి నాణ్యతను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. కాగా “పల్లె పండుగ”లో ఇచ్చిన హామీ మేరకు కంకిపాడు-గొడవర్రు-రొయ్యూరు రోడ్డు నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభించి సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.

=====================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ శనివారం పాయకరావుపేటలో “మెగా జాబ్ ఫెయిర్” నిర్వహిస్తున్నామని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. ఈ రోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ జాబ్ ఫెయిర్ కి సంబంధించిన గోడ పత్రికను కలెక్టర్ విడుదల చేశారు. ఈ మెగా జాబ్ ఫెయిర్ కు సుమారుగా 50 జాతీయ, బహుళ జాతీయ వాణిజ్య సంస్థలు హాజరవుతాయని, సుమారు రెండు వేల ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నారని కలెక్టర్ ఈ సందర్భంగా వెల్లడించారు.

విరామం

=====================

శ్రీకాకుళం జిల్లా అరసవిల్లిలో రథసప్తమి పండుగను రాష్ట్ర స్థాయి పండుగలా నిర్వహించాలని ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉత్తర్వులు జారీ చేశారని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై ఈరోజు జరిగిన సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పి కె.వి.మహేశ్వర రెడ్డి, సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, శ్రీకాకుళం జిల్లా స్థానిక శాసన సభ్యులతో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కమిటీ సభ్యులు సమన్వయంతో కలిసి పని చేయాలని కోరారు. ఇతర రాష్ట్రాల నుండి లక్షలాదిగా భక్తులు వస్తారని, అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. గత అనుభవాల దృష్ట్యా లోపాలను సవరించుకుంటూ వేడుకలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

======================

పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడి ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు సమీపంలో ఉన్న నైరుతి బంగాళాఖాతంలోనే కొనసాగే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర తెలిపింది. మరో రెండు రోజుల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందని.. 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని పేర్కొంది. అల్పపీడన ప్రభావంతో ఈరోజు నుంచి గురువారం వరకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఇదిలా ఉండగా విశాఖ పోర్టులో మూడో నెంబర్ సాధారణ ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. గురువారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని విశాఖ తూఫాన్ హెచ్చరికల కేంద్రం సూచించింది.

======================

నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం కొలిమిగుండ్ల మండలం బందర్లపల్లి చెక్ పోస్టు వద్ద నాపరాతి కార్మికులు, గనుల యజమానులు చేపట్టిన దీక్షకు రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నాపరాతి పరిశ్రమల ఇబ్బందులకు సంబంధించి.. గత ప్రభుత్వ విధానాల వల్లనే గనుల యజమానులపై ప్రస్తుతం అదనపు భారం పడుతోందన్నారు. నాపరాతి పరిశ్రమల ఇబ్బందులను, గని యజమానులు సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యను పరిష్కరిస్తామని మంత్రి తెలియజేస్తూ....

(వాయిస్ 25 సెకన్లు)

======================

అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలో ఈరోజు ఉదయం ఒక పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో  కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. పరవాడ ఫార్మసిటీలో ఈరోజు ఒక కంపెనీలో హైడ్రోజన్ సల్ఫైయిడ్ వాయువులు విడుదలై ఒడిశాకు చెందిన ఇద్దరు కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురైయ్యారు. కార్మికులకు కిమ్స్ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నామని, వారిలో ఒకరి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని వైద్యులు తెలియజేసారు. ఈ ప్రమాద ఘటనపై విచారణ జరిపి నివేదిక అందించాల్సిందిగా  పరిశ్రమలు, పొల్యూషన్ కంట్రోల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

======================

విజయనగరం జిల్లాలో మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆదేశించారు.

======================
======================